క్లుప్తంగా

డాక్టర్ రామచంద్రరావుకు విశిష్ట కళారత్న అవార్డు



నెల్లూరు మేయర్ స్రవంతి నుంచి అవార్డు అందుకుంటున్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమలో వివిధ రంగాలల్లో విశిష్ట సేవాలందిస్తున్న పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీకి చెందిన స్వచ్ఛంద సేవకులు, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్. రామచంద్రరావుకు విశిష్ట కళారత్న అవార్డును నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ చేతుల మీదుగా అందజేశారు.

సాయి భక్తుల భిక్షాటన



భిక్షాటన కార్యక్రమంలో పాల్గొన్న సాయి భక్తులు, ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో పది రోజులుగా షిరిడీ సాయి 105వ మహాసమాధి పుణ్యతిథి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో బాగంగా మంగళవారం ఉదయం సాయిబాబాకు 108 వెండి కలశాలతో పవిత్ర నదీ జలాలు, ఆవుపాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, నిర్వహించారు. 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ జి. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. పూజల్లో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్లు బీవీ శ్యాంకుమార్, పద్మాకర్ ఆత్రే, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీదేవి, జాయింట్ సెక్రటరీలు రవికుమార్, శ్యామల రావు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

గాజా ప్రజలకు మద్దతుగా మౌన ప్రదర్శన



చార్మినార్: గాజా విల్ నెవర్ డై..స్టాప్ బాంబింగ్ ఆన్ గాజా..లాంగ్ లివ్ పాలస్తీన్..అంటూ కొంత మంది ముస్లింలు మంగళవారం ప్లకార్డులు పట్టుకొని మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా గాజా ప్రజలకు అండగా ఉండాల్సిన సమయం వచ్చిందని..వారికి మానసిక స్థైర్యాన్ని కల్పించడం కోసం తాము చార్మినార్ వద్ద ఈ ప్రదర్శన చేపట్టామని సిటిజన్స్ కన్సర్న్డ్ ఆఫ్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. చార్మినార్ వద్ద జరిగిన ఈ నిరసన ప్రదర్శన సమాచారం చార్మినార్ ఏసీపీతో పాటు స్థానిక పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

వ్యక్తి అదృశ్యం



అనిల్‌కుమార్ కత్రి

అబిడ్స్: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉస్మాన్‌గంజ్ రిసాలాబ్జుల్లాలో నివసించే అనిల్ కుమార్ కత్రి (30) స్టేషనరి వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 20వ తేదీ రాత్రి తన సెల్‌ఫోన్ మరమ్మతు కోసం అబిడ్స్ జగదీశ్‌మార్కెట్‌కు వెళ్లిన అనిల్‌కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేక పోవడంతో మంగళవారం తండ్రి ఓంప్రకాష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ.శైలజ పేర్కొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

గోల్కొండ: కాలనీల అభివృద్ధికి నిరంతరం తాను కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీలో జరిగిన టోలిచౌకీ కాలనీల సంక్షేమ సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాలనీలలో రోడ్లు, ఐమాస్ట్ లైట్ల ఏర్పాటు, అవసరమైన చోట వీడీ, సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కాలనీ సంక్షేమ సంఘం వారు తన దృష్టికి తెచ్చిన సమస్యలను కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. టోలిచౌకీ నదీమ్ కాలనీ, బాల్‌రెడ్డినగర్, విరాసత్‌నగర్ తదితర కాలనీలలో బాక్స్ డ్రైనేజీను వేయడంతో ఈ కాలనీలకు వరద ముంపు తప్పిందన్నారు.

ప్రజల చేతుల్లో వజ్రాయుధం 'సీ-విజిల్'

- యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో పరిష్కారం
- ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యం
- యాప్‌పై మలక్‌పేట నియోజకవర్గంలో అధికారుల విస్తృత ప్రచారం

చాదర్‌ఘాట్: ఎన్నికల్లో అక్రమాల నియంత్రణకు సీ-విజిల్ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను ఈ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం చేశారు. మలక్‌పేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీ-విజిల్ యాప్ ద్వారా మూడు ఫిర్యాదులు అందగా రెండు ఫిర్యాదులు అరగంట వ్యవధిలోనే పరిష్కరించారు. గోడరాతలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో పాటు అనుమతులు లేకుండా ప్రదర్శనలు, ఊరేగింపులు, ప్రచారాలు చేయడం, డబ్బులు, మద్యం, బహుమతులు పంపిణీ చేస్తే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.



ఎన్నికల ఉల్లంఘనలపై నేరుగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఏఆర్‌ఓ జయంత్

- నేరుగా వచ్చి కూడా మలక్‌పేట జోనల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు అందజేయవచ్చు. ఎక్కడికక్కడ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారో వాటి వివరాలను ఈ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.
- ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు, పౌరులను భాగస్వాములను చేసే చేసే దిశగా ఈ యాప్‌ను ప్రవేశపెట్టారు.
- పౌరులు ఎవరైనా సరే ఎన్నికల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కేవలం ఒకఫొటో లేదా చిన్న వీడియో గానీ తీసి అప్‌లోడ్ చేస్తే చాలు తక్షణమే అధికారులు చర్యలు తీసుకుంటారు. ఈ యాప్‌పై కొంత కాలంగా అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ 2023

మహేశ్వరానికి వెల్లువలా పెట్టుబడులు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో శాంతి భద్రతలు కాపాడుతూ సురక్షిత పాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి, మహేశ్వరం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సబితా ఇంద్రారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి సబితా రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో కోట్లాది రూపాయలతో మహేశ్వరం నియోజకవర్గంలో వెల్లువలా పెట్టుబడులు వస్తున్నాయని, అనేక మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, మహేశ్వరం అభివృద్ధి నియోజకవర్గంలో సబితమ్మ పాత్ర ఎంతో గొప్పదన్నారు. కోట్లాది రూపాయల నిధులు తెచ్చి అనునిత్యం ప్రజల మధ్యలో ఉండే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నాగేష్, వెంకటేష్‌తో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం మూర్తి మంత్ర హోమం, మహా పూర్ణాహుతి, తిలకధారణ, అన్నప్రసాద వితరణ, సాయంత్రం దేవతోద్వాసన, పండిత సన్మానం, ఉత్సవ ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జనప్రియ హోమ్స్‌లో...

ఎల్‌బీనగర్ చింతలకుంట జనప్రియ హోమ్స్‌లోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న త్రయోవింశ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ పీ.వీ.నరసింహారావు, కార్యదర్శి కే.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయనగర్‌లో వేంకటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సిలిండర్ పేలి అగ్నిప్రమాదం: గృహోపకరణాల దగ్ధం

సైదాబాద్: దసరా సందర్భంగా ఇంట్లో పిండివంటలు వండుతుండగా సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం... ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివసించే శశికళ స్థానికంగా కిరాణాషాపు నిర్వహిస్తోంది. పండుగ సందర్భంగా సోమవారం రాత్రి ఇంట్లో ఆమె పిండివంటలు వండుతోంది. సిలిండర్‌లోని గ్యాస్ అయిపోవడంతో వేరే సిలిండర్ బిగిస్తుండగా హఠాత్తుగా పేలింది. దాంతో ఇంట్లో మంటలు వ్యాపించాయి. భయంతో శశికళ సహా ఇంట్లోని వారు బయటకు పరుగు తీశారు. వెంటనే స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకం సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడకు చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, ఇంట్లోని పలు గృహోపకరణాలు దగ్ధమైనట్టు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

మలక్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడతానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ అస్రఫ్ నగర్ కాలనీవాసులతో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు ముందుంటానని చెప్పారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ మాట్లాడుతూ, డివిజన్‌లో రోడ్లు, పార్కులు అభివృద్ధి చేశామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేశామన్నారు. సమావేశంలో కాలనీవాసులు, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

శాంతి సామరస్యానికి నిదర్శనంగా పాతబస్తీలో ఉత్సవాలు

చార్మినార్: శాంతి సామరస్యానికి పాతబస్తీలోని ఉత్సవాలు నిదర్శనంగా కొనసాగుతాయని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నాగులచింతలోని ఆర్యమైదానంలో జరిగిన దసరా వేడుకల్లో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇలాంటి సామాజిక సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘమిత్ర అసోసియేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రముఖ సంఘసేవకుడు, ,గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞత తదితరులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో శంకర్, పెంజర్ల సత్యనారాయణ, అర్జున్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ ఠాణాను సందర్శించిన డీసీపీ రోహిత్ రాజ్



డీసీపీ రోహిత్ రాజుకు స్వాగతం పలుకుతున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.రోహిత్ రాజ్ సందర్శించారు. ఆయనకు కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి ఆయనకు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఏసీపీ బి.రోహిత్ రాజ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడినా సంహించేది లేదని హెచ్చరించారు. సమాజంలో మంచి వ్యక్తులుగా మెలుగుతూ కుటుంబంతో సంతోషంగా ఉండాలని రౌడీషీటర్లకు సూచించారు.



మాట్లాడుతున్న డీసీపీ బి.రోహిత్ రాజు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ బాలస్వామి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జియాగూడ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకే వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సౌత్, వెస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి అన్నారు. మంగళవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌నగర్‌లోని పలువురి రౌడీషీటర్ల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మహ్మద్ అబ్దుల్ జావేద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ పరిధిలో..

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదైన హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఇలియాజ్ ఇంటికి మంగళవారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బి.రోహిత్ రాజు, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా ఎవరూ రోడ్లపై కూర్చుంటూ గొడవలకు దిగరాదన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన సదానంద్ రెడ్డి

చంపాపేట: ఎల్‌బీ నగర్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు బొక్క సదానంద్ రెడ్డి తన అనుచరులతో మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం సదానంద్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తాను బీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్‌రెడ్డి, ముద్ద పవన్, నల్లా రఘుమారెడ్డి, గౌతమ్‌రెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, కటికరెడ్డి అరవిందరెడ్డి, నిఖిల్, పార్టీలో చేరినవారిలో చందు, మనీష్, హకీమ్, అంజి పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన సదానంద్‌రెడ్డి

ఆత్మీయ సమ్మేళనం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, వెంకటాపూర్, బడంగ్‌పేట్, బాలాపూర్, నాదర్‌గుల్, మామిడిపల్లి, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు పాల్గొని సబితారెడ్డికి స్వాగతం పలికారు. మీ వెంటే మేము ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.



సబితారెడ్డిని అభినందిస్తున్న కాలనీవాసులు

అంబరాన్నంటిన దసరా సంబరాలు



కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ ప్రాంగణంలో జమ్మిపూజలో పాల్గొన్న భక్తులు



మలక్‌పేట హరిహర క్షేత్రంలో శమీ పూజలో పాల్గొన్న భక్తులు



దహనానికి సిద్ధంగా ఉన్న రావణ ప్రతిమ

చంపాపేట/ నాగోలు/మలక్‌పేట: ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో సోమవారం దసరా సంబురాలు అంబరాన్ని అంటాయి. ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గాదేవికి భక్తులు పంచామృత అభిషేకాలు, అష్టోత్తర నామావళి, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, చండీహోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలు, మండపాల వద్ద బాణసంచా కాల్చి జమ్మి పూజ చేసి రావణ దహనం చేశారు. రావణ దహనంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చంపాపేట క్రికెట్ క్లబ్ ఆవరణలో...

చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయం, మూడుగుళ్ల ఆవరణ, రాజిరెడ్డినగర్‌లోని సాయిబాబా ఆలయాలతో పాటు కాలనీలలోని అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రికెట్ క్లబ్ ఆవరణలోని అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడింది. కటకోనికుంట, సుల్తానా అల్వా, దుర్గానగర్, మారుతీనగర్ వంటి పలు పరిసర కాలనీవాసులు సాంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను భక్తులు వేలంలో పోటీపడి దక్కించుకున్నారు.

సాయిరాంనగర్ కాలనీలో...

చంపాపేట సాయిరాంనగర్ వినాయక పార్కులో నిర్వహించిన దసరా సంబురాలు అంబరాన్ని అంటాయి. తొమ్మిది రోజుల పాటు ఇళ్లలో అమ్మవారికి పూజలు చేసిన భక్తులు అమ్మవారి ప్రతిమలు మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి పూజకు వివిధ కాలనీలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జమ్మి పూజ అనంతరం రావణ దహనం చేశారు.

కర్మన్‌ఘాట్ రాంలీలా మైదానంలో..

కర్మన్‌ఘాట్ రాంలీలామైదానంలో దసరా సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మిపూజ, రావణదహనం చేశారు.

కొత్తపేటలో...

నాగోలు: కొత్తపేటలో శ్రీ ప్రసన్న మహాకాళి అమ్మవారి ఆలయంలో ట్రస్ట్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శమీ పూజ చేశారు. నాగోలు డివిజన్ బండ్లగూడలో నిర్వహించి దసరా ఉత్సవాల్లో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొని రావణ దహనం, శమీ పూజ నిర్వహించారు.

హరిహర క్షేత్రంలో...

మలక్‌పేట: మలక్‌పేట పల్టాన్‌లోని హరిహర క్షేత్రం, మైసమ్మ దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాజరాజేశ్వరి అలంకరణలో పూజలు అందుకున్నారు. విజయదశమి రోజున సాయంత్రం 5 గంటలకు శమీ పూజలు చేశారు. ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ సూగూరు రమేష్, ఈఓ మార్తండరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్ రాజీవ్‌గాంధీనగర్‌లో జమ్మి పూజలో పాల్గొన్న జోగు రాములు, కాలనీవాసులు



బండ్లగూడలో శమీ పూజలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు



కొత్తపేటలో ప్రసన్న మహాకాళి గుడిలో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న వజీర్ ప్రకాష్‌గౌడ్

పల్లకిపై ఊరేగిన విజయదుర్గ



మాతామైదాన్‌లో అమ్మవారి పల్లకి సేవ



సైదాబాద్‌లో అమ్మవారి ఊరేగింపులో యువతుల నృత్యాలు

సైదాబాద్: దసరా పండుగ తేదీ విషయంలో కొంత అయోమయం కారణంగా పండుగను కొందరు సోమవారం, కొందరు మంగళవారం నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పెద్దతోటలోని వాగామ్రి దుర్గామాత ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కాశీవాల అశోక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైదాబాద్‌లోని విజయదుర్గా మాతను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం సైదాబాద్ పురవీధుల్లో పల్లకి పై ఊరేగించారు. మహిళలు, యువత పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొని కోలాటం, నృత్యాలు చేశారు.



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు